కావేరి యూనివర్సిటీకి నేడు గవర్నర్ రాక

● ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభానికి ఏర్పాట్లు



గజ్వేల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం గౌరారంలోని కావేరి యూనివర్సిటీకి శుక్రవారం ఉదయం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రానున్నట్లు కావేరి యూనివర్సిటీ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ భాస్కర్ రావు గురువారం ప్రకటనలో తెలిపారు. కావేరి యూనివర్సిటీలో కావేరి ఇంటిగ్రెటెడ్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఆయనతో పాటు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, ఎడ్యుకేషన్ సెక్రటరీ రాజేంద్రసింగ్ పరోడ రానున్నట్లు ఆయన వివరించారు.

ప్రభుత్వ బాలుర హైస్కూల్, జూనియర్ కాలేజీ
పెండింగ్ పనులను పరిశీలించి సమీక్ష చేసిన నిర్మల, జగ్గారెడ్డి

- హై స్కూల్, కళాశాల మధ్య కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు
- కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ. 50 లక్షలు
- హైస్కూల్, కళాశాల గ్రౌండ్‌లో గ్రావెల్ కోసం రూ.20 లక్షలు
- హైస్కూల్‌లో కొత్తగా నిర్మించిన బిల్డింగ్ పెయింటింగ్ కోసం రూ. 10 లక్షలు
- హైస్కూల్, జూనియర్ కళాశాలలో పెండింగ్ పనుల కోసం మొత్తం రూ. 1.30 కోట్ల కోసం కలెక్టర్‌కు వినతిపత్రం



సంగారెడ్డిలోని హై స్కూల్‌ను పరిశీలిస్తున్న నిర్మల, జగ్గారెడ్డి



సంగారెడ్డిలోని జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న నిర్మల, జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని బాయ్స్ హైస్కూల్, జూనియర్ కళాశాలను టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం సందర్శించారు. కళాశాల, జూనియర్ కళాశాలలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 1.30 కోట్లు అవసరమని ప్రిన్సిపాల్ కోరారు. జూనియర్ కళాశాలో నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు జగ్గారెడ్డి సూచించారు. బాయ్స్ హైస్కూల్‌లో నిర్మించిన రెండంతస్తుల భవనానికి పెయింటింగ్ వేయాలని జగ్గారెడ్డిని కోరారు. ఇందుకు స్పందించిన జగ్గారెడ్డి మాట్లాడుతూ పాఠశాల, కళాశాల మధ్య ప్రహరీ, గేటు నిర్మాణానికి రూ. 50 లక్షలు, జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు, సేఫ్టీ వాల్, గ్రిల్స్ కోసం రూ. 50 లక్షలు, గ్రౌండ్‌లో గ్రావెల్ కోసం రూ. 20 లక్షలు, కొత్తగా నిర్మించిన రెండంతస్తుల భవనానికి పెయింటింగ్ కోసం రూ. 10 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల ద్వారా ప్రతిపాదనలు కలెక్టర్‌కు అందజేస్తామని జగ్గారెడ్డి తెలిపారు. వారివెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్, జార్జ్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

● కలెక్టర్ హైమావతి



వడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

సిద్దిపేట/కొండపాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. గురువారం చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మొక్కజొన్న నిల్వను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

పచ్చిపులుసు పెట్టడంపై కలెక్టర్ ఆగ్రహం

మధ్యాహ్న భోజనంలో కామన్ డైట్‌ను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ హైమావతి తెలిపారు. గురువారం కొండపాక మండలంలోని దుద్దెడలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను ఆమె పరిశీలించారు. పచ్చిపులుసు తయారు చేయడంపై సిబ్బందిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పచ్చిపులుసు పెట్టవద్దని హెచ్చరించినప్పటికీ ఎందుకు పెట్టారని ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించగా, ఈ రోజు వంట సిబ్బంది రాలేదని తెలిపారు. పచ్చిపులుసు తీసేసి కూరతో మాత్రమే విద్యార్థులకు వడ్డించారు. పచ్చిపులుసు పెట్టినందుకు హెచ్‌ఎం, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీఈవోకు ఆదేశించారు. దుద్దెడలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఎంఎల్‌హెచ్‌పీ బి. సంధ్య, ఏఎన్‌ఎం స్వరూప రాణి గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మకు అవాంతరాలు

- లబ్ధిదారులను పీడిస్తున్న స్థల వివాదాలు, పక్కింటి పంచాయితీలు, అన్నదమ్ముల తగాదాలు
- ప్రతిబంధకాలుగా నిబంధనలు
- మొదటివిడతలో 1,272 ఇళ్లు రద్దు
- రెండోవిడత నోటీసులకు సిద్ధం
- ఏడాదిగా ఇళ్ల నిర్మాణాలకు అడ్డంకులు



నిర్మాణంలో ఉన్న ఇందిర్మ ఇల్లు

దుబ్బాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం విధించిన నిబంధనలు స్థల వివాదాలు, సరిహద్దు (సూరు) పంచాయితీలకు దారితీయడంతో చాలా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. పాత ఇళ్లను కూల్చి కొత్తగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలనుకున్న లబ్ధిదారులకు స్థల కొలతలకు సంబంధించిన వివాదాలు, పక్కింటి పంచాయితీలు, అన్నదమ్ముల మధ్య తగాదాలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా 40 గజాల పైన, 60 గజాల లోపు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం జరగాలన్న ప్రభుత్వ నిబంధన పాత ఇళ్లకు సరిపోవడం లేదు. పాతకాలపు ఇళ్లకు వాస్తు సరిగా లేకపోవడం, నలుదిక్కుల కొలతలు సమానంగా లేకపోవడంతో... ఇళ్లు కూల్చి కొలతలు వేసిన తర్వాత పక్కింటి వాళ్ల అభ్యంతరాల వల్ల పనులు ఆగిపోతున్నాయి. దీంతో గ్రామాలల్లో ఇంటి పంచాయితీలు ఇందిరమ్మ పంచాయితీలుగా మారిపోయా యి. ఓ గ్రామంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం కారణంగా ఏకంగా తమ్ముడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలిసింది. దుబ్బాక మున్సిపాలిటీలో చాలా వరకు ఇళ్లు స్థల వివాదాలకు దారితీస్తుండగా, దుబ్బాక మండలంలో సరిహద్దు పంచాయితీలు పోలీసులకు తలనొప్పిగా మారాయి.

మొదటి విడతలో..

జిల్లాలో రెండు విడుతలుగా ప్రభుత్వం 11,194 ఇళ్లను మంజూరు చేసింది. అందులో మొదటి విడుతలో 7875 ఇళ్ల పనులు ప్రారంభం కాగా, కేవలం 3320 ఇళ్ల పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. స్థల వివాదాలు, అన్నదమ్ముల పంచాయితీలు సహా వివిధ కారణాలతో సుమారు 1,272 ఇళ్లను అధికారులు రద్దు చేశారు. రద్దయిన వాటిలో సగానికి పైగా స్థల వివాదాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మరో 2,331 ఇళ్ల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది.

40 రోజుల్లో పూర్తిచేయాలి..

ప్రభుత్వం విధించిన లక్ష్యం ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయి అధికారులకు తలనొప్పిగా మారింది. ఐదు మున్సిపాలిటీల్లో కమిషనర్‌లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇదే పంచాయితీలతో సతమతమవుతున్నారు. గ్రామాల్లో గృహనిర్మాణశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తగవులు తీర్చేందుకు పరిమితం అవుతున్నారు. అన్నదమ్ములు భూములు పంచుకున్నప్పటికీ, పట్టా రికార్డుల్లో లేకపోవడం కూడా వివాదాలకు కారణమవుతోంది. 20 ఏళ్లుగా గ్రామాల్లో స్థల సర్వే, రికార్డులు సరిగా లేకపోవడంతో సమస్య మరింత జఠిలమైంది. దసరా ముహూర్తాలకైనా ఇళ్ల పనులు మొదలవుతాయని భావించినా ఏడు నెలలు వేచి చూసినా ఫలితం లేకపోయింది. దీపావళి రావడంతో, కార్తీక మాసంలోనైనా మిగిలిన పనులు ప్రారంభిస్తారనే ఆశతో ఆగిపోయిన నిర్మాణాలకు అధికారులు నోటీసులు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. రానున్న 40 రోజుల్లో ఇళ్లను నిర్మించుకోవాలని, లేకుంటే రద్దు చేస్తామని అధికారులు లబ్ధిదారులను హెచ్చరిస్తున్నారు.

మరింత కిక్కు

కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు సమర్పించే ప్రక్రియ పూర్తయ్యింది. ఇప్పటికే ఒకసారి గడువు పెంచిన విషయం తెలిసిందే. అయినప్పటికి కూడా స్పందన అంతంత మాత్రంగానే ఉంది. ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షల ఫీజు నిర్ణయించడంతో ఆశావహులు వెనుకంజ వేశారు. మొత్తంగా దరఖాస్తుల సంఖ్య తగ్గినప్పటికీ ఫీజుల రూపంలో ఆబ్కారీ శాఖకు ఆదాయం పెరిగింది. తమకు అప్పగించిన టార్గెట్‌ను చేరడానికి ఆ శాఖ అధికారులు నెల రోజుల పాటు చెమటోడ్చడం గమనార్హం.

- సిద్దిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- దరఖాస్తు ఫీజుల రూపంలో రూ. 259 కోట్లు
- క్రితం సారితో పోలిస్తే రూ. 15 కోట్ల అధికం
- దరఖాస్తులు తగ్గినా.. పెరిగిన ఆదాయం
- ముగిసిన మద్యం దుకాణాల టెండరు ప్రక్రియ
- రూ. 3 లక్షల ఫీజుతో ఆశావహుల వెనుకంజ
- దరఖాస్తులు పెంచేందుకు చెమటోడ్చిన అధికారులు



ఉమ్మడి మెదక్ జిల్లాలోని 243 మద్యం దుకాణాలకు గత సెప్టెంబరు 26నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తొలుత అక్టోబరు 18 వరకు గడువు విధించగా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. దీంతో మరో ఐదు రోజుల గడువు పెంచి ఈనెల 23వరకు డెడ్‌లైన్ పెట్టారు.



ఊహించినట్లుగానే సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా దరఖాస్తులు రాగా సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ అదేస్థాయిలో దరఖాస్తులు వచ్చాయి.

రూ.259 కోట్ల ఆదాయం..

కొత్త వైన్‌షాపుల్లో అమ్మకాలు ప్రారంభించకముందే ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆబ్కారీ విభాగానికి భారీ ఆదాయం సమకూరింది. దరఖాస్తుల రూపంలోనే రూ.259 కోట్లు వచ్చి పడ్డాయి. ఈసారి 8,634 దరఖాస్తులు రాగా ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షల ఫీజు విధించడంతో దరఖాస్తుల సంఖ్య కాస్త తగ్గింది. రెండేళ్ల కిందట ఇదే ఉమ్మడి మెదక్ జిల్లాలో 12,227 దరఖాస్తులు సమర్పించారు. నాడు దరఖాస్తుకు రూ.2లక్షలు మాత్రమే ఉండడంతో రూ.244 కోట్లు సమకూరింది. ప్రస్తుతం 3,593 దరఖాస్తులు తగ్గినా రూ.15కోట్ల ఆదాయం పెరగడం విశేషం. దరఖాస్తుకు రూ.లక్ష చొప్పున ఎక్కువ నిర్ణయించడంతోనే ఈ ఆదాయం పెరిగింది.

ఈ ఏడాది దరఖాస్తుల వివరాలు

జిల్లా	వైన్‌షాపులు	దరఖాస్తులు	ఆదాయం (కోట్లలో)
సంగారెడ్డి	101	4,432	132.96
సిద్దిపేట	93	2,782	83.46
మెదక్	49	1,420	42.60
మొత్తం	243	8,634	259.02

రెండేళ్ల క్రితం దరఖాస్తుల వివరాలు

జిల్లా	వైన్‌షాపులు	దరఖాస్తులు	ఆదాయం (కోట్లలో)
సంగారెడ్డి	101	6,156	123.12
సిద్దిపేట	93	4,166	83.32
మెదక్	49	1,905	38.10
మొత్తం	243	12,227	244.54

శ్రమించిన ఆబ్కారీశాఖ..

దరఖాస్తుల సంఖ్యను పెంచడానికి ఆబ్కారీ శాఖ అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. కానిస్టేబుల్ నుంచి ఈఎస్‌లు, డిప్యూటీ కమిషనర్ దాకా నిత్యం దృష్టి సారించారు. మొదట్లో దరఖాస్తులు తక్కువగా రావడంతో తర్జనభర్జన పడ్డారు. ఆ తర్వాత మద్యం వ్యాపారులు, ఇతర ఆశావహులను ప్రోత్సహించే

మిగతా 8వ పేజీలో

కుక్క దాడిలో విద్యార్థికి గాయాలు



గాయపడ్డ విద్యార్థి

సిద్దిపేటరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కుక్క దాడిలో విద్యార్థి చేతికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న గ్యార అరవింద్ రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల సమీపంలో కుక్క విద్యార్థిపై దాడి చేయడంతో చేతికి తీవ్ర గాయమైంది. విద్యార్థిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో మూడు రోజుల్లో ముగ్గురిపై కుక్క దాడి చేయడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వాన దారులు



- గజ్వేల్ పరిధిలో రోడ్లన్నీ గుంతలమయం
- ఆదమరిస్తే అంతే సంగతులు
- మరమ్మతుకు నోచుకోని వైనం

7

← గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డులో బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎదుట ఏర్పడిన గుంతలు

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం



రాఘవాపూర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

● ఎస్ఈ చంద్రమోహన్

సిద్దిపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడమే లక్ష్యమని విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్ అన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'పల్లెబాట' కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. వ్యవసాయానికి సరఫరాలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్‌లపై అదనపు భారం పడి విద్యుత్ సరఫరాలో లోవోల్టేజి సమస్య ఏర్పడుతోందని రైతులు ఎస్ఈ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు ఏమున్నా విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ రామచంద్రయ్య, ఎంఆర్‌టీ డీఈ పండరి, ఏడీఈ శ్రీనివాసులు, ఏఈ రమేశ్, లైన్‌మెన్ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

సాఫీగా సాగేలా..

- హుస్నాబాద్- కొత్తపల్లి ఫోర్‌లేన్ పనులు షురూ..
- రూ. 77.20 కోట్లతో పనులు
- హుస్నాబాద్- జనగామ రోడ్డుకు మోక్షం దొరికితే
- అంతర్ రాష్ట్రాలకు తగ్గనున్న దూరాభారం

హుస్నాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కరీంనగర్-హైదరాబాద్ రాజీవ్ రహదారిలోని కొత్తపల్లి-హుస్నాబాద్ ఫోర్‌లేన్ రహదారి పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం హుస్నాబాద్ నుంచి జంగల్ కటింగ్ (పొదలు తొలగింపు), విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ విస్తరణ పనులకు గతేడాది అక్టోబరులో తొలి విడతగా రూ. 77.20 కోట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది జూన్ 27న మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ పట్టణం వరకు ఉన్న సుమారు 20 కిలోమీటర్ల ఈ రహదారి ప్రస్తుతం 60 ఫీట్ల వెడల్పు ఉంది. దీనిని నాలుగు వరుసల రహదారి (ఫోర్‌లేన్)గా విస్తరణ చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు కరీంనగర్‌కే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం నుంచి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రవాణా మార్గం మరింత సుగమం కానుంది. ఇప్పటికే ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట, రామాయంపేట వరకు జాతీయ రహదారి పనులు జరుగుతుండగా, కరీంనగర్ రాజీవ్ రహదారి కొత్తపల్లి నుంచి హుస్నాబాద్‌కు నాలుగు వరుసల రహదారి పనులు కూడా మొదలవడంతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.



రోడ్డు వెడల్పులో భాగంగా చెట్లను కొట్టేసిన దృశ్యం

వినతుల వెల్లువ

కొత్తపల్లి-హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు ప్రారంభం కావడంతో, హుస్నాబాద్ నుంచి జనగామ వరకు కూడా ఇదే తరహా పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఫోర్‌లేన్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే ప్రభుత్వానికి పంపించారు. ఈ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి కూడా మంత్రి పొన్నం లేఖ రాశారు. గతంలో దీనిని రాష్ట్ర రహదారి (స్టేట్ హైవే)గా అభివృద్ధి చేస్తామని నాటి ప్రభుత్వం హామీ ఇచ్చినా, అది ప్రతిపాదనలకే పరిమితమైంది. అప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా భారత్ మాల పథకం కింద జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా, అది కూడా కార్యరూపం దాల్చలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రాజెక్టును ప్రాధాన్యంగా తీసుకోవడంతో, త్వరలో ఈ పనులకు కూడా నిధులు మంజూరవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.



హుస్నాబాద్- కొత్తపల్లి ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా జరుగుతున్న జంగిల్ కటింగ్ పనులు

అనేక ప్రయోజనాలు

ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రవాణా పరంగా అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. అంతర్‌రాష్ట్ర రవాణాతో పాటు తెలంగాణలోని మూడు జిల్లాలకు రాకపోకలు సులభమవుతాయి. ఈ రహదారి కరీంనగర్, సిద్దిపేట, జనగామ జిల్లాలను కలుపుతుంది. కరీంనగర్ నుంచి హుస్నాబాద్ మీదుగా జనగామ, సూర్యపేట, విజయవాడకు. అలాగే వేములవాడ, ధర్మపురి, బాసర, యాదాద్రి పుణ్యక్షేత్రాలకు దూరాభారం తగ్గుతుంది. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రజలు యాదాద్రి వెళ్లాలంటే సిద్దిపేట, చేర్యాల, జనగామ మీదుగా లేదంటే

మిగతా 8వ పేజీలో

హుస్నాబాద్‌లో వర్షం.. తడిసిన ధాన్యం



మార్కెట్ యార్డులో పాక్షికంగా తడిసిన ధాన్యం

హుస్నాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో గురువారం రాత్రి జోరు వర్షం కురిసింది. 10 నిమిషాల పాటు వర్షం కురువడంతో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం పాక్షికంగా తడిసింది. వర్షం వచ్చే సూచనలు కనబడటంతో రైతులు ముందుగానే ధాన్యాన్ని కుప్పలు చేసి కవర్లు కప్పి వర్షం నుంచి రక్షించుకున్నా కూడా ధాన్యం తడిసింది.

చెరువులో పడి వృద్ధుడి మృతి

సిద్దిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మలవిసర్జన కోసం వెళ్లిన వృద్ధుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన గురువారం వర్గల్ మండలం సీతారాంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు సీతారాంపల్లి గ్రామానికి చెందిన పిట్ల లక్ష్మీనర్సయ్య (72) అనే వృద్ధుడు కొడుకు భిక్షపతితో గ్రామంలో నివాసముంటు న్నాడు. ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం పనిమీద భిక్షపతి వేరే గ్రామానికి వెళ్లడంతో తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటివద్ద ఒంటరిగా ఉన్నాడు. పనిమీద వేరే గ్రామానికి వెళ్లిన భిక్షపతి బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తండ్రి కనిపించలేదు. గురువారం ఉదయం గ్రామ సమీపంలో జనిగాలాబంధం చెరువులో శవమై కనిపించాడు. మల విసర్జన కోసం వచ్చి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయి నట్లు గుర్తించారు. మృతుడి కొడుకు భిక్షపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పిట్ల లక్ష్మీనర్సయ్య (ఫైల్)

పరిశ్రమలో కార్మికుడి మృతి

జహీరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి గ్రామశివారులోగల ఇండస్ట్రియల్ ఏరియాలోని మంగళట్యూబ్‌పరిశ్రమలో అస్సాంకు చెందిన కాంట్రాక్టు కార్మికుడు రోహిత్‌గోగోయ్(39) బుధవారం రాత్రి మృతిచెందాడు. కర్మాగారంలో పనిచేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగిందని చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అస్సాంకు చెందిన రోహిత్‌గోగోయ్ కొంత కాలంగా కర్మాగారంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులకువెళ్లి అక్కడ కటింగ్ యంత్రంపై పనిచేస్తున్న క్రమంలో జారిపడి యంత్రపై పడ్డాడు. దీంతో రోహిత్‌గోగోయ్ బలమైన గాయాలకు గురికాగా వెంటనే మెరుగైనవైద్యం నిమిత్తం జహీరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం బీదర్‌కు మెరుగైన వైద్యం నిమిత్తం తీసుకువెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు.

● ధర్నాతో దిగివచ్చిన యాజమాన్యం

బూచనెల్లి గ్రామశివారులోగల ఇండస్ట్రియల్ ఏరియాలోని మంగళట్యూబ్‌పరిశ్రమలో అస్సాంకు చెందిన కాంట్రాక్టు కార్మికుడు రోహిత్‌గోగోయ్ పని చేస్తున్న క్రమంలో మృతిచెందడంతో గురువారం సీఐటీయూ నాయకులు కర్మాగారం ఎదుట ఆందోళనకు దిగారు.

కార్మికుడికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేయడంతో యాజమాన్యం అందుకు అంగీకరించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.5లక్షలు నష్టపరిహారం, రూ.2లక్షలు అంత్యక్రియల ఖర్చులు, రూ.2లక్షలు శవంతీసుకువెళ్లడానికి రవాణా చార్జీలు ఇవ్వడానికి అంగీకరించడంతో ఆందోళన విరమించడమైందని సీఐటీయూ జిల్లా నాయకులు మైపాల్ పేర్కొన్నారు.


పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

హత్య కేసులో భార్యాభర్తలకు జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో భార్యాభర్తలకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా 2వ అదనపు న్యాయాధికారి డాక్టర్ పి.పి.కృష్ణార్జున్ గురువారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఇసోజిపేటకు చెందిన కూరగాయల వ్యాపారి దూదేకుల యాకూబ్ (46), ఆయన భార్య దూదేకుల వహీదా బేగం(37)లు కలిసి సంగారెడ్డికి చెందిన ఇర్ఫాన్ అలీని ఇసోజిపేటలో 2019 ఏప్రిల్ 1న హత్య చేశారు. ఈ మేరకు పుల్కల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. కేసు ఆదారాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో భార్యాభర్తలైన దూదేకుల యాకూబ్, దూదేకుల వహీదాబేగంలకు జీవిత ఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.3వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున జి.విజయశంకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

ద్విచక్రవాహనం కారును ఢీ కొని..

● ఒకరిగా తీవ్రగాయాలు

సిద్దిపేట, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం కారును ఢీకొనడంతో వాహనదారుడికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామశివారులో చోటుచేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై సమతా, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...బైక్‌పై వస్తున్న బైండ్ల యాదగిరి ఎదురుగా వస్తున్న కారును అదుపుతప్పి ఢీకొనడంతో తీవ్రగాయాలు కావడం జరిగిందన్నారు. అలాగే రోడ్డుపక్కకు దూసుకునివెళ్లి విద్యుత్ స్థంబాన్ని ఢీకొట్టడంతో విద్యుత్ స్థంభం విరిగి కారుపై పడింది. కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.


కారుపై పడిన విద్యుత్తు స్థంభం

మెట్ల పైనుంచి జారిపడ్డ బాలిక

● తలకు బలమైన గాయం

● కస్తూర్బా విద్యాలయంలో ఘటన

మెదక్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రామాయంపేట మున్సిపల్ పరిధి కోమటిపల్లి కస్తూర్బా విద్యాలయ విద్యార్థిని మెట్ల పైనుంచి జారిపడగా తీవ్ర గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం ఈ ఘటన జరగగా.. సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. తోటి విద్యార్థులు తోసేసారో.. లేక ఆ బాలికే పడిపోయిందో తెలియదు కాని తలకు బలమైన గాయమైంది. ఎనిమిదో తరగతి చదివే ప్రియాంకను చికిత్స అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ లింబాద్రి డిశ్చార్జ్ చేశారు. బాధిత బాలికకు సిటీ స్కాన్ చేయించాలని కస్తూర్బా సిబ్బందికి ఆయన సూచించారు.


గాయపడ్డ ప్రియాంక

పాఠశాలలో పాము కలకలం


గజగట్లపల్లి పాఠశాలలో పాము

చిన్నశంకరంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కురిసిన వర్షాలకు చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో పాము కలకలం సృష్టించింది. గురువారం ఉదయం పాఠశాల సిబ్బంది తరగతి గదులను శుభ్రం చేస్తున్నారు. ఈక్రమంలో పాఠశాల ఆవరణలోని విషపూరితమైన పాము ఉండడాన్ని గమనించిన విద్యార్థులు ఒక్కసారిగా భయంతో బయటకు పరుగులు తీశారు. పాఠశాల చుట్టూ దట్టంగా చెట్లపొదలు ఉండడంతో పాము గదిలోకి చేరి ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు గాలయ్య తెలిపారు. గ్రామస్థులతో కలిసి పామును చంపేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా చేశారు.

గడువు ముగిసిన శీతల పానీయాలు

కౌడిపల్లి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 23: కొంత కాలంగా గడువు ముగిసిన శీతల పానీయాలు విక్రయిస్తున్నారు. మండలంలోని కంచన్‌పల్లిలోని ఓ కిరాణ షాపులో వారం రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన కుమార్ అనే వ్యక్తి గ్రామంలోని ఓ ఫంక్షన్‌కు వచ్చి స్థానిక కిరాణ షాపులో మినిట్ మైడ్ (శీతల పానీయం) ను 400 ఎంఎల్‌ను కొనగోలు చేశాడు. తేదీ పరిశీలన చేయగా గడువు 8.8.2025 నాటికి ముగిసింది. దీంతో మింట్ మైడ్ వాపసు ఇచ్చి స్ప్రైట్ తీసుకోగా దాని గడువు 9.10.2025 నాటికి ముగిసింది. దీంతో వినియోగదారుడు మాట్లడుతు శీతల పానీయాలు అధిక ధరలకు విక్రయించడమే గాకుండా గడువు ముగిసిన వాటిని విక్రయించి ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. మారుముల గ్రామాలలోని ప్రజలు గడువు తేది గ్రహించక పోవడంతో ఆసరగా చేసుకోని తక్కువ ధరకు శీతల పానీయాలు కొనుగోలు చేసి అధిక లాభం పోందుతున్నారని అన్నారు.



ఆగస్టు 8 వ తేదీ 2025కు గడువు ముగిసిన మింట్ మైడ్


అక్టోబరు 9 వతేదీ 2025 నాటికి గడువు ముగిసిన స్ప్రైట్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

సదాశివపేట, అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట పట్టణానికి చెందిన మహ్మద్ పాషా(45) అతడి మిత్రుడు ఎం.డీ.యూసుఫ్(50) గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై సదాశివపేట నుంచి జహీరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని పట్టణ సమీపంలో ఓ వేబ్రిడ్జి వద్ద 65వ జాతీయ రహదారిపై వెనక వైపు నుంచి ఓ లారీ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహ్మద్ పాషా, ఎం.డీ. యూసుఫ్‌లు తీవ్ర గాయాల పాలయ్యారు. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాషా, యూసుఫ్‌లు రాత్రి 7గంటల సమయంలో మృతి చెందారు. పాషా కుమారుడు ముజాహీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ వెంకటేష్ పేర్కొన్నారు.


మృతి చెందిన మహ్మద్ పాషా


ఎం.డీ.యూసుఫ్

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


గణేష్ కుమార్ (ఫైల్)

ములుగు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ములుగు మండలం బైలంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బైలంపూర్ గ్రామానికి చెందిన దాసరి గణేష్ కుమార్ (20) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి జేబులో ఉన్న లెటర్‌ను పరిశీలించగా అనారోగ్య కారణాలవల్ల ఎవరిని ఇబ్బంది పెట్టకూడదని ఉద్దేశంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని నా చావుకు ఎవరు కారణం కాదని లెటర్ రాశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం కొరకు మృతుడిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుకున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

ప్రమాదకరంగా గుంతలు

నర్సాపూర్,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆ చౌరస్తా రెండు ప్రధాన రోడ్లకు చౌరస్తా రోజు వందలాది వాహనాలు తిరిగే రోడ్లు.. పైగా పట్టణ వాసులు కూడా పెద్దసంఖ్యలో తిరుగుతుంటారు ఆ చౌరస్తానే మెదక్-హైదరాబాద్, తూప్రాన్-సంగారెడ్డి ప్రధాన రోడ్లు కలిసే నర్సాపూర్‌లోని చౌరస్తా. అటువంటి ప్రధాన నర్సాపూర్ పట్టణంలోని చౌరస్తా వద్ద తరుచు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి పూట గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు అయితే అదుపు తప్పుతున్న ఘటనలు కూడా అవుతున్నాయి. ఈ గుంతలు తరుచు ఏర్పడటం వాటిని తాత్కాలికంగా మరమ్మత్తు చేస్తుండటంతో మళ్లి అదే తంతుగా మారి వాహనదారుల పాలిట చౌరస్తా శాపంగా మారిందని పలువురు వాహనదారులు వాపోతున్నరు. అధికారులు ఇప్పటికైనా శాశ్వతంగా గుంతలు మరమ్మత్తు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.


నర్సాపూర్ పట్టణంలోని రెండు ప్రధాన రోడ్ల చౌరస్తా వద్ద ఏర్పడిన పెద్దపెద్ద గుంతలు

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు

● అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసినా, అక్రమంగా నిల్వ ఉంచినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హెచ్చరించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్, వాణిజ్య పన్నుల వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అక్రమ రేషన్ బియ్యం కేసుల పరిశీలనలో వేగం పెంచాలని, రేషన్ బియ్యం అక్రమ రావాణా వాహనాలను పట్టుకున్నప్పుడు పోలీస్, రెవెన్యూ శాఖలాధికారులు తప్పనిసరిగా వీడియో, ఫోటో ఆధారాలను సేకరించి 6-ఎ నివేదికకు జతపరిచి సమర్పించాలని సూచించారు. బియ్యం రవాణాకు సంబంధించిన బిల్లులను ఏసీటీవో అధికారులు ఒక రోజులోగా పరిశీలించి వాహన రాకపోకల మూలాలను నిర్ధారించాలన్నారు. స్వాధీనం చేసుకున్న అక్రమ రవాణా బియ్యాన్ని ప్రతి 15 రోజులకోసారి పత్రికల్లో ప్రకటన ఇచ్చి బహిరంగా వేలం వేసి విక్రయించాలని అధికారులను ఆదేశించారు. కోర్టుల్లో ప్రభుత్వ ప్రయోజనాలను రక్షించేందుకు డీసీఎస్‌వో ప్రభుత్వ న్యాయవాదులు, పీపీలతో సమావేశమై సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉత్తర్వులు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, పౌర సరఫరాల శాఖ డీఎం అంబాదాస్ రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో రెవెన్యూ, జిల్లా పౌరసరఫరాలు, పోలీస్ వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

పీడీఎస్ బియ్యం పై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి


స్వాధీనం చేసుకున్న బియ్యం సంచులు

మెదక్, కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మెదక్ మండల పరిధిలోని రాజ్‌పల్లి గ్రామ సరిహద్దులోని మల్బరీ ఫార్మ్ హౌస్‌లో అక్రమంగా నిల్వ చేసిన 22 బియ్యం సంచులను టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం సంచులను మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరపనున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ టాస్క్ ఫోర్స్ సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణా లేదా విక్రయాలపై ఎవరైనా పాల్పడితే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడరాదని, ఇలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగితే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని అన్నారు .



శివ్వంపేట.. ఆధ్యాత్మిక తోట

విశిష్ట ఆలయాల నెలవుగా మండలం

స్వయంభువుగా చాకరిమెట్ల ఆంజనేయస్వామి

700 ఏళ్ల లక్ష్మీనరసింహస్వామి

ఇటీవలే శ్రీభగలాముఖి ఆలయ నిర్మాణం

పర్యాటకంగా భక్తులను ఆకర్షిస్తున్న మండలం

నర్సాపూర్/శివ్వంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలం ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకంగా నిలుస్తున్నది. ప్రముఖ ఆలయాలతో విరాజిల్లుతూ, ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రత్యేకతను చాటుకుంటోంది. ఈ ఆలయాల కారణంగా ఈ ప్రాంతం పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందేందుకు విశేషమైన అవకాశం ఉంది. చిన్నగొట్టిముక్ల సమీపంలో అటవీ ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన చాకరిమెట్ల ఆంజనేయస్వామి, సికింద్లాపూర్‌లో ఏడు వందల సంవత్సరాల క్రితం వెలసిన లక్ష్మీనరసింహస్వామి, దొంతిలో పూర్వకాలంలో సంస్థానాధీశులు నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయాలు, అలాగే శివ్వంపేటలో ఇటీవలనే నిర్మించిన శక్తిపీఠం శ్రీభగలాముఖి ఆలయం ఈ మండలానికే ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఈ ఆలయాలను దర్శించుకునేందుకు సమీప ప్రాంతాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివస్తున్నారు.

సికింద్లాపూర్‌లో లక్ష్మీనరసింహస్వామి



సికింద్లాపూర్‌లోని లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం, ఆలయంలోని స్వామివారు

సికింద్లాపూర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఘనమైన చరిత్ర ఉంది. సుమారు ఏడు వందల సంవత్సరాల క్రితం గ్రామ శివారులోని అటవీప్రాంతంలో సప్తరుషులు తపస్సు చేస్తుండగా గుట్టపైన స్వామివారి గాండ్రింపులు వినిపించాయని పూర్వీకులు చెబుతుంటారు. రుషులు అక్కడ రెండు శిలల మధ్య ఉగ్రరూపంలో ఉన్న నరసింహస్వామిని గుర్తించి, ఆవేశంలో ఉన్న స్వామిని శాంతింపజేశారని చరిత్ర కథనం. భక్తుల కోరిక మేరకు స్వామి శిలగా మారి, నేటికీ రెండు బండరాళ్ల మధ్యలో దర్శనమిస్తున్నారు. ఈ ఆలయ సమీపంలో ఉన్న కోనేరుకు ప్రత్యేకత ఉంది. ఇందులో స్నానం చేస్తే చర్మవ్యాధులు పోతాయనే నమ్మకం. ఇక్కడ ప్రతి ఏటా ధనుర్మాసం నుంచి ఉగాది వరకు మూడు నెలల పాటు ప్రతీ ఆదివారం ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.

సంస్థానాధీశులు నిర్మించిన దేవస్థానం



దొంతి వేణుగోపాలస్వామి ఆలయం

దొంతి గ్రామంలో సుమారు ఐదువందల సంవత్సరాల క్రితం ఇక్కడి సంస్థానాధీశులు నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. స్వామివారి దివ్య దర్శనంతో సర్వదోష నివారణ కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇక్కడ 22 పంచలోహ విగ్రహాలు కలిగి, చుట్టూ 12 గుళ్లమధ్య వేణుగోపాలస్వామి వెలిశారు. ఇంతటి విశేషం కలిగిన దేవాలయానికి 230 ఎకరాల మాన్యం ఉండటం గమనార్హం. ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తారు.

దక్షిణ భారతంలో తొలి ఆలయం



శివ్వంపేటలోని శ్రీభగలాముఖి అమ్మవారి ఆలయం దక్షిణ భారతదేశంలోనే మొదటిదిగా ప్రత్యేకతను చాటుకుంది. 1961లో శృంగేరి జగద్గురు విద్యాతీర్థ స్వామి, 1985లో భారతీతీర్థ స్వామి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏకైక ఆస్థాన విద్వాంసులైన శ్రీశాస్త్రుల విశ్వనాథశాస్త్రి స్థాపించిన వేద శాస్త్ర పాఠశాల ఇక్కడే ఉండగా, వందమంది విద్యార్థులను వేదపండితులుగా తీర్చిదిద్దారు. ఇక్కడ శ్రీభగలాముఖి అమ్మవారి ఆలయం నిర్మించాలని సంకల్పించి, దాతల సహకారంతో 18 నెలల్లోనే ఆలయాన్ని నిర్మించారు. పసుపు గంధకంతో ఉద్భవించిన భగలాముఖి అమ్మవారు ఇక్కడ దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకుంటే శత్రు స్తంభన కలుగుతుందని, శత్రువులను సైతం మిత్రులుగా మార్చే అనుగ్రహం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఉన్న తర్వాత దక్షిణభారతదేశంలో మన రాష్ట్రంలో శివ్వంపేటలో ఈ ఆలయం నిర్మించడం విశేషం. ప్రతీ అమావాస్య, పౌర్ణమికి ఆలయ వ్యవస్థాపకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



శివ్వంపేటలోని భగలాముఖి ఆలయం

చిన్నగొట్టిముక్ల సమీపంలో అంజన్న



చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయం, ఆంజనేయస్వామి

సంగారెడ్డి - తూప్రాన్ అటవీప్రాంతంలో చిన్నగొట్టిముక్ల సమీపంలో ఉన్న చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం స్వయంభువుగా వెలిసిన క్షేత్రంగా ప్రసిద్ధి. పూర్వ కాలంలో ఇక్కడి ఆంజనేయస్వామికి మహర్షులు పూజలు చేసేవారని ప్రతీతి. అటవీప్రాంతంలో చింతచెట్టు నీడన వెలసిన ఈ ఆలయం, దాతల సహకారంతో ఆలయ ట్రస్టీ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో 24 రెక్కలతో తామర పువ్వు ఆకారంలో నిర్మించిన గర్భగుడితో అద్భుత క్షేత్రంగా రూపుదిద్దుకుంది. ఆలయం పక్కనే వజ్రాకారంలో నిర్మించిన సత్యనారాయణస్వామి వ్రత మండపం ఇక్కడి ప్రత్యేకత. ఈ మండపంలో వ్రతాలు చేయిస్తే కోరిన కోరికలు తీరుతాయనే నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి వ్రతాలు చేయించుకుంటారు. ఒకేసారి ఐదువందల మంది వరకు వ్రతాలు చేసుకునేలా మండపాన్ని నిర్మించడం విశేషం.

ప్రకృతి ఒడిలో కొలువైన మేడాలమ్మ

నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఆలయం



నల్లవల్లి అటవీ ప్రాంతంలోని మేడాలమ్మ ఆలయం, స్వాగత తోరణం

గుమ్మడిదల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ పచ్చని అటవీ ప్రాంతం, పక్షుల కిలకిల రాగాలు, నెమలి నృత్యాలతో ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి రమణీయత మధ్య వెలసిన శక్తిస్వరూపిణీ మేడాలమ్మ. గుమ్మడిదల మండల కేంద్రానికి సమీపంలో నల్లవలి అటవీ ప్రాంతంలో మెదక్ - హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే అమ్మవారు కొలువై ఉన్నారు. ఆదివారం వచ్చిందంటే చాలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా హైదరాబాద్ నగరం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. అమ్మవారి సన్నిధానంలో పూజలు చేసి, పచ్చని చెట్ల మధ్య కుటుంబసభ్యులతో కలిసి వంటలు వండుకుని, తిని ఆనందంగా గడుపుతుంటారు.

ఆలయం దినదినాభివృద్ధి



ఆలయంలోని మేడాలమ్మ

నల్లపల్లి అటవీ ప్రాంతంలో మేడాలమ్మ తల్లి ఆలయానికి రోజురోజుకు భక్తుల తాకిడి పెరుగుతోంది. గతంలో ఇక్కడ చిన్న పుట్ట మాత్రమే ఉండేది. గ్రామస్థులు గర్భగుడిని కట్టించారు. కొన్నాళ్లకు నల్లపల్లి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త సంజీవరెడ్డి ముందుకొచ్చి దాతల సహకారంతో కొత్త హంగులతో ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు వంటలు వండుకోవడానికి దాతలు ముందుకు వచ్చి షెడ్లు వేశారు. తాగునీటి సమస్య లేకుండా బోర్లు వేయించారు. నర్సాపూర్ - హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన ఆలయ స్వాగత తోరణాన్ని నిర్మించారు. పట్నం ప్రాంతం నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు ఇక్కడ బస చేసి, వంటలు వండుకుని సంతోషంగా గడుపుతారు. ఎలాంటి కాలుష్యం లేని ప్రాంతంగా ఉండటంతో భక్తులు ఇక్కడ రావడానికి ఎక్కువ ఇష్టపడతారు. ఫంక్షన్లు, రిటైర్మెంట్లు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఇక్కడ ఎక్కువగా ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే, కమాన్ నుంచి ఆలయం వరకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆలయాన్ని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని, అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయానికి ఎలా చేరుకోవాలి

మేడారమ్మ తల్లి ఆలయం నల్లవల్లి బస్టాండ్‌కు సమీపంలో ఉంటుంది. నర్సాపూర్ నుంచి వచ్చేవారు ఈ బస్టాండ్‌లో దిగవచ్చు. అక్కడి నుంచి కిలోమీటరు దూరంలోనే ఆలయ స్వాగత తోరణం రోడ్డు పక్కన ఉంటుంది. హైదరాబాద్ నుంచి వచ్చేవారు గుమ్మడిదల గ్రామం దాటిన తర్వాత నల్లవల్లి బస్టాండ్ వస్తుంది. దానికి కిలోమీటరు దూరం వెళ్లిన వెంటనే కుడివైపున కమాన్ కనిపిస్తుంది.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు ఖేడ్ విద్యార్థులు

నారాయణఖేడ్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు నారాయణఖేడ్ నెక్సస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ నరేష్‌చారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కోరుట్లలో జరిగిన జూనియర్, సబ్ జూనియర్ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు అనన్య, నైనిక, కీర్తన, అక్షర, బాలుర విభాగంలో కోనక్, ఆదిత్య సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కిషన్, హెచ్‌ఎం నిర్మల, పీఈటీ వంశీ, గీత విద్యార్థులను అభినందించారు.

రంగోత్సవ్ పోటీల్లో వెల్దుర్తి విద్యార్థుల ప్రతిభ

వెల్దుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరులో ముంబయికి చెందిన వారు జాతీయస్థాయిలో నిర్వహించిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ఆర్ట్ పోటీల్లో మెదక్ జిల్లా వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలను సాధించారని హెచ్‌ఎం విక్రమ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 62 మంది విద్యార్థులు పాల్గొనగా, ఇందులో 18 మంది బంగారు, 10 మంది వెండి, పది మంది కాంస్య పతకాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ వాయు కాలుష్యంపై ఆందోళన

జిన్నారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :గడ్డపోతారం పరిధిలోని విష్ణు కెమికల్స్ పరిశ్రమ నుంచి వాయు కాలుష్యం, బూడిద అధిక శాతం వెలువడుతుందని సమీపంలోని కిష్టయ్యపల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ వద్ద కాలుష్యం తీరును స్థానికులు పరిశ్రమ ప్రతినిధులకు తెలియజేసి వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ఉపాధ్యాయుడి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి

● పాఠశాల గదికి తాళం వేసి గ్రామస్థుల నిరసన



దొమ్మాట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తరగతి గదికి తాళం వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సిద్దిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం దొమ్మాట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి డిప్యుటేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు నిరసన చేపట్టారు. గురువారం పాఠశాల తరగతి గదికి తాళం వేసి ఆందోళన చేశారు. బడిబాటలో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాల్సింది పోయి బదిలీ చేయడం సరికాదని మండిపడ్డారు. వెంటనే డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని, విద్యాశాఖాధికారులు స్పందించకుంటే తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తామని పేర్కొన్నారు.

ప్రతిభను వెలికితీయడానికి టాస్క్ దోహదం

● టాస్క్ ఉపాధి కల్పన విభాగం అధ్యక్షుడు శ్యామ్‌కుమార్

జహీరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి టాస్క్ దోహదపడుతుందని టాస్క్ ఉపాధి కల్పన విభాగం అధ్యక్షుడు శ్యామ్‌కుమార్, వశిష్ట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో నైపుణ్యాన్ని పెంచి పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు టాస్క్ ఉపయోగపడే తీరుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా టాస్క్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి వైద్య శిబిరాలు

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

● పోలీసుల సమగ్ర ఆరోగ్య శిబిరం విజయవంతం

● 1,155 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరానికి హాజరైన పోలీసులు, వారి కుటుంబీకులు



మాట్లాడుతున్న ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల సంక్షేమానికి మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. పోలీసుల సమగ్ర ఆరోగ్య శిబిరం ముగింపు కార్యక్రమం సంగారెడ్డి పోతిరెడ్డిపల్లిలోని ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం ఏదో ఒకరకమైన విధుల్లో నిమగ్నమయ్యే పోలీసులకు సమయానికి భోజనం, విశ్రాంతి లేకపోవడం, శారీరక మానసిక భారం వంటి సమస్యలు సిబ్బంది ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ అత్యంత ముఖ్యమని జిల్లా పోలీసు శాఖ, ఐయంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో కాంప్రిహెన్సివ్ హెల్త్ క్యాంప్ (సమగ్ర ఆరోగ్య శిబిరం)ను నిర్వహించామని తెలిపారు. జిల్లా పోలీసుల సంక్షేమం కోసం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ శిబిరం ద్వారా 40 సంవత్సరాల వయసుపైబడిన పోలీసులు, వారి కుటుంబసభ్యులు మొత్తం 1155 మంది వైద్య పరీక్షలను చేయించుకుని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ క్యాంపు ద్వారా సిబ్బందికి ప్రత్యేక రికార్డును నిర్వహణ చేపడతామని పేర్కొన్నారు. జిల్లా పోలీసుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని, ముందు కూడా ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తూ.. సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల కోసం శ్రమించే పోలీసులకు సేవలందించడానికి వైద్య శాఖ ముందుంటుందని అన్నారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి పూర్తిస్థాయి సేవలను అందించగలరని తెలిపారు. అలాంటి పోలీసుల ఆరోగ్యం రక్షణకు జిల్లా పోలీసు శాఖతో కలిసి మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, డీఎస్పీ సత్యయ్యగౌడ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్, జనరల్ సెక్రెటరీ డా.ఆనంద్, అంబేడ్కర్ కాలేజ్ నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైవే విస్తరణకు 20 ఫీట్లు ఎక్కువ తీసుకుంటున్నారు

● కంది గ్రామస్థుల ఆందోళన

సంగారెడ్డి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మదీనాగూడ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు ఆరు లేన్ల మేర విస్తరించనున్న 65వ నంబర్ జాతీయ రహదారిలో తమ వద్ద 20 ఫీట్ల మేర ఎక్కువ స్థలం తీసుకుంటున్నారని గురువారం కంది గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీకాంత్, సర్వేయర్ కోటేశ్వరరావు, ఆర్ఐ రంగయ్య, జీపీవో రేణుక, హైవే అథారిటీ అధికారులు చాంద్ పాషా గ్రామస్థులతో కలిసి రోడ్డు విస్తరణలో కోల్పోయే స్థలాలను, షాపులను పరిశీలించారు. గ్రామస్థులకు తగిన న్యాయం చేస్తామని అధికారులు భరోసా ఇచ్చారు. తమకు న్యాయం జరగని పక్షంలో గ్రామస్థులంతా ఏకమై పెద్దఎత్తున ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరించారు. ఈ పరిశీలనలో గ్రామస్థులు డాక్టర్ కన్నయ్యా, కమ్మరి విజయ్ కుమార్, శ్రీనివాస్, కే.నాగరాజ్, శ్రీకాంత్, సజ్జద్, రఘురామయ్య, ఏ.రమేష్, లక్ష్మణ్ గుప్తా, మంగళ్ పవర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌అండ్‌బీ అధికారులకు పాత రోడ్డు మ్యాప్‌ను చూపుతున్న గ్రామస్థులు

అధ్వాన దారులు

గజ్వేల్ పరిధిలో రోడ్లన్నీ గుంతలమయం

ఆదమరిస్తే అంతే సంగతులు

మరమ్మతుకు నోచుకోని వైనం



జగదేవ్‌పూర్-అలిరాజ్‌పేట మధ్య బ్రిడ్జిపై ఇనుప చువ్వలు తేలిన రోడ్డు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రోడ్డులోని హెచ్‌పీ బంక్ వద్ద ఏర్పడిన గుంత

గజ్వేల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్ నియోజకవర్గంలో ప్రధాన రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి నుంచి వర్గల్ మండలం నాచారం వరకు విస్తరించి ఉన్న నేషనల్ హైవే 161ఏఏ రోడ్డుతో పాటు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. అంతర్గత రోడ్ల పరిస్థితి కూడా ఘోరంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదమరిస్తే క్షతగాత్రులుగా మారడం ఖాయంగా మారిన ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

దెబ్బతిన్న రోడ్లు

● ప్రమాదాలు నిత్యకృత్యంగా మారిన రోడ్లలో నేషనల్ హైవే 161ఏఏ ప్రధానంగా ఉంది. శ్రీగిరిపల్లి రింగ్‌రోడ్డు నుంచి మొదలుకుని గజ్వేల్ పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు రోడ్డుపై పడిన గుంతలు పెద్దవిగా మారి ప్రమాదాలను సృష్టిస్తున్నాయి.



గజ్వేల్ పట్టణంలోని ముట్రాజ్‌పల్లి రోడ్డులో ఏర్పడిన భారీ గుంత

● ప్రజ్ఞాపూర్ ప్రధాన చౌరస్తా నుంచి యూనియన్ బ్యాంకు వరకు, అలాగే యూనియన్ బ్యాంకు నుంచి ఇందిరాపార్కు చౌరస్తా వరకు ఇదే దుస్థితి కొనసాగుతోంది. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే, వేలాది మంది ప్రజలు నడిచే మార్గమైన అంబేడ్కర్ చౌరస్తా వద్ద రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఇందిరాపార్కు చౌరస్తా నుంచి జగ్జీవన్‌రాం చౌరస్తా వరకు పరిస్థితి మరింత ఘోరంగా మారడంతో వాహనదారులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు.

● ప్రజ్ఞాపూర్ నుంచి జగదేవ్‌పూర్ వరకు అనేక భారీ గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా జగదేవ్‌పూర్-అలిరాజ్‌పేట మధ్య గల బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల్లోంచి ఇనుప చువ్వలు తేలి, రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల జాతీయ రహదారిగా మారిన ఈ మార్గాన్ని నేషనల్ హైవే అథారిటీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మున్సిపాలిటీ రోడ్ల పరిస్థితీ అంతే

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని అంతర్గత రోడ్ల పరిస్థితి కూడా దయనీయంగా ఉంది.

● ముట్రాజ్‌పల్లి రోడ్డులో మహతి ఆడిటోరియం, పీఎన్‌ఆర్ గార్డెన్స్ పోలీస్‌స్టేషన్ ఎదుట భారీ గుంతలు ఏర్పడినా పూడ్చడం లేదు.

● జాలిగామ బైపాస్‌లో ఎంట్రీ పాయింట్, వైన్స్ దాటాక, ఎంఎల్ఎస్ పాయింట్ ఎదురుగా, నూనె మిల్లు ఎదురుగా, ఎస్‌ఆర్‌వో కార్యాలయం వద్ద భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి.

● రింగ్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా సంగాపూర్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

రోడ్ల మరమ్మతులు చేయండి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుకు వెంటనే మరమ్మతు చేయాలి. నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా జగదేవ్‌పూర్ రోడ్డులో, ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. నాయకులు, అధికారులు స్పందించాలి. లేనిపక్షంలో ప్రజలతో కలసి ఆందోళనకు దిగుతాం.

-మరికంటి కనకయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు

అంతర్గత రోడ్లను బాగు చేయండి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో అంతర్గత రోడ్డు అన్ని గుంతలమయంగా మారాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అంబేద్కర్ చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ రోడ్డులో నిత్యం వేలాది మంది ప్రజలు, వందలాది వాహనాలు తిరుగుతుండగా, రోడ్డు పూర్తిగా ఛిద్రమయ్యాయి. గుంతలు ఏర్పడి ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే అధికార యంత్రాంగం స్పందించి మట్టితోనైనా గుంతలను పూడ్చాలి. మరమ్మత్తులు చేపట్టాలి.

-నాయిని సందీప్‌కుమార్, బీజేపీ నాయకుడు

నిర్లక్ష్యంపై ఆగ్రహం

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే కలెక్టర్, స్థానిక నాయకులు స్పందించి ప్రమాదకరంగా మారిన రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- రైతులు మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



దౌల్తాబాద్: గాజులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దౌల్తాబాద్/రాయపోల్/సిద్దిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు అమ్ముకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలంలోని దీపాయంపల్లి, శేరిపల్లి బందారం, దొమ్మాట, గాజులపల్లి, మిరుదొడ్డి మండలం చెప్యాల, మిరుదొడ్డి, కాసులాబాద్ గ్రామాల్లో, అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతె, భూంపల్లి, బేగంపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లర్లకు తరలించాలని అధికారులకు సూచించారు. అనంతరం, దొమ్మాటలో ఇటీవల మరణించిన అరవింద్ రెడ్డి కుటుంబాన్ని వారు పరామర్శించారు. మాచినపల్లి మల్లన్న గుట్ట ప్రాంతంలో ఇటీవల చిరుత పులి సంచారం చేసిన అటవీ ప్రాంతాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరిశీలించి, అడవికి సమీపంగా వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాయపోల్ మండలం బేగంపేటలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. బేగంపేట, ఎల్కల్, వడ్డెపల్లి నుంచి నాచారం వరకు గుంతలమయంగా మారిన రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని బేగంపేట గ్రామస్థులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రహీముద్దీన్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకటరెడ్డి, రాజలింగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బుడ్డ రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్/జగదేవ్‌పూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి రైతులకు సూచించారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, పాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖానో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, వ్యవసాయాధికారులు గుండు నాగరాజు, వసంతరావు, సీఈవో రాములు, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తూకాలు ప్రారంభించాలని నిరసన

సిద్దిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వెంటనే తూకాలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుసంఘం నాయకులు గురువారం చేర్యాల మండలం ఆకునూరులో నిరసన చేపట్టారు. సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ప్రారంభించి రెండు వారాలు గడిచినా తూకం చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్వాహకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే కాంటా చేపట్టి, త్వరితగతిన లిఫ్టింగ్ చేసి, నిర్ణీత గడువులోగా డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనియెడల ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొండకాయల సంపత్, రమేష్, గోపాల్‌రెడ్డి, కడారి రాజయ్య, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కడారి సాయిబాబా, బాలవ్వ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్

సిద్దిపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోతుల బెడద నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోతులు ఆహారం కోసం దాడులకు పాల్పడుతుండటంతో ప్రజలు తీవ్రంగా గాయపడుతున్నారన్నారు. కోతుల గుంపుల పంటలపై దాడి నాశనం చేస్తున్నాయన్నారు. వానర మూకల సంరక్షణ నిమిత్తం ప్రతీ జిల్లాకు 200 ఎకరాలు కేటాయించి ప్రహరీ నిర్మించాలని కోరారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల జాతీయ సదస్సుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదిక కానుంది. కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి, రాష్ట్రీయ ఉచ్చతర శిక్షా అభియాన్ (ఆర్‌యూఎస్ఏ) సహకారంతో 'సైబర్ సెక్యూరిటీ, చాలెంజెస్ అండ్ ప్రాస్పెక్టివ్స్' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. అక్టోబరు 24 25న జరిగే ఈ సదస్సుకు పర్కోస్ గ్రూప్ సీఈవో ప్రమీల అర్జున్ ప్రారంభ వక్తగా హాజరుకానున్నారు. ముగింపు సమావేశానికి పోలీస్ కమిషనర్ ఎస్.ఎం విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తారు. వివిధ కంపెనీల నుంచి నిపుణులు, యూనివర్సిటీల నుంచి ఆచార్యులు, విద్యార్థులు పాల్గొని సైబర్ నేరాలు, ఫోరెన్సిక్స్, సోషల్ మీడియా, ఈఎఫ్‌టీ తదితర అంశాలపై లోతైన విశ్లేషాత్మక చర్చలు చేసి పత్ర సమర్పణ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్లుగా డాక్టర్ మామిడాల శ్రీనివాస్, గురుచరణ్‌దాసు వ్యవహరించనున్నారు.

గజ్వేల్ పత్తి మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా శివారెడ్డి



శివారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ స్థానిక మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన చిట్కుల శివారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ హైమావతి ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలోని పత్తి మిల్లులు ఉన్న ప్రతి మండలానికి ఐదుగురితో కూడిన కమిటీని నియమించారు. ఈ కమిటీ పత్తి కొనుగోళ్ల పర్యవేక్షణ నిర్వహిస్తూ, కొనుగోళ్లలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించనుంది. అలాగే జగదేవ్‌పూర్‌కు మహేష యాదవ్, కొండపాకకు రాజీరవ్వ, కె. రాజయ్య, చేర్యాలకు శ్రీశైలం, హుస్నాబాద్‌కు సాంబరాజు, బెజ్జంకికు లక్ష్మణ్, దౌల్తాబాద్‌కు రమేష్, తోగుటకు దనుంజయ్‌లను పత్తి మానిటరింగ్ సభ్యులుగా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



తొగుట రైతు వేదికలో రైతులకు సబ్సిడి విత్తనాలను పంపిణీ చేస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

తొగుట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై పొద్దుతిరుగుడు, మొక్కజొన్న విత్తనాలను అందిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి సూచించారు. గురువారం తొగుట రైతు వేదికలో జాతీయ నూనె గింజల పథకంలో భాగంగా రాయితీపై వచ్చిన విత్తనాలను రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. నూనెగింజల పంటలకు మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉందని, రైతులు ఈ పంటల సాగుకు మొగ్గుచూపి అధిక లాభాలు పొందాలని సూచించారు. విత్తనాలు అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకుని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్, తొగుట మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'మలన్న' నిత్యాన్నదాన సత్రానికి విరాళం



దాతలను సన్మానిస్తున్న ఆలయాధికారులు,అర్చకులు

కొమురవెల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రానికి గురువారం ఇద్దరు దాతలు విరాళాలు అందించారు. రాంసాగర్ గ్రామానికి చెందిన అక్కెనపల్లి వాణిప్రవీణ్‌రెడ్డి దంపతులు, నంగునూర్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఒంటెరు స్వప్నరాజశేఖర్ రెడ్డి దంపతులు చెరో రూ.100,016 చొప్పున మొత్తం రూ.2,00,032 లను ఆలయాధికారులకు అందించి మహరాజ పోషకులుగా రసీదు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటాన్ని,శేషవస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ , పర్యవేక్షులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో మున్సిపల్ కమిషనర్, నిర్వాహకులు

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కల్పించాలి

- హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తి కల్పించినట్లయితే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్ అన్నారు. గురువారం మినీ స్టేడియంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా, వాజ్‌పేయి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ లెవెల్ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. క్రీడలతో కూడా ఉన్నత భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వాజ్‌పేయి యూత్ అసోసియేషన్ నాయకులు బత్తుల శంకర్‌బాబు, నాయకులు వేల్పుల నాగార్జున, పోలోజు రాజేందర్, వరియోగుల అనంతస్వామి, అనిల్ నాయక్, ఎంపైర్ జాల శ్రీనివాస్, దిలిప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానలకు సుస్తీ

- రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు పాల సాయిరాం



సిద్దిపేట బస్తీ దవాఖానలో డాక్టర్ అందుబాటులో లేరని చూపిస్తున్న సాయిరాం

సిద్దిపేట అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను కాంగ్రెస్ ప్రభుత్వం 'సుస్తీ దవాఖానాలు'గా మార్చిందని రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు పాల సాయిరాం విమర్శించారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని ఆర్‌డీవో కార్యాలయం పక్కన ఉన్న బస్తీ దవాఖానాను ఆయన స్థానిక వార్డు కౌన్సిలర్ తాడూరి సాయిఈశ్వర్‌గౌడ్‌తో కలిసి సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్, హరీశ్‌రావుపై కోపంతో బస్తీ దవాఖానాలను నిర్వీర్యం చేసి, పేద ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నదని మండిపడ్డారు. దవాఖానాల్లో వైద్యులు లేరని, పరికరాలు పనిచేయడం లేదని, మందులు, కిట్స్, పరీక్షలు లేవని, సిబ్బంది లేకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రజా వైద్యం మీద దృష్టి పెట్టాలని, జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి బస్తీ దవాఖానాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి

- ఎంపీ రఘునందనరావుకు జేఏసీ నాయకుల వినతి



ఎంపీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న అందె గ్రామ జేఏసీ నాయకులు

సిద్దిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా మారిన మిరుదొడ్డి మండలం అందె గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఎంపీ రఘునందనరావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 15 ఏళ్ల క్రితం వేసిన పంచాయతీ రాజ్ రోడ్డుతో పాటు ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలుపడి ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పనులను చేపట్టే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. అలాగే జేఏసీ రాష్ట్ర చైర్మన్ కొదండరాంకు కూడా వినతి పత్రాన్ని అందజేశారు.

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ నేతల ప్రచారం



రహమత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

ములుగు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మాగంటి సునీత విజయం తథ్యమని సిద్దిపేట జిల్లా ములుగు మండలం పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్ గౌడ్ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారంలో భాగంగా రహమత్‌నగర్‌లోని 160, 164 బూతుల్లో తిరుగుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులే మాగంటి సునీత గోపీనాథ్ గెలుపుకు దోహదపడతాయని నరేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో బూతుల ఇన్‌చార్జిలు గడ్డం శ్రీధర్, మాయలత, బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ పాషా, ప్రకాష్, వెంకటేష్, శివకుమార్, సుధాకర్, శివశంకర్, బాలు, సత్యవతి, మధు, మురళి తదితరులు పాల్గొన్నారు.

మరింత 'కిక్కు'

(5వ పేజీ తరువాయి)



ప్రయత్నం చేశారు. దరఖాస్తుల స్వీకరణలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీతామై వ్యవహరించారు. దరఖాస్తులు తిరస్కరణ కాకుండా స్వయంగా వివరాలను నమోదు చేయించారు. ఎప్పటికప్పుడు దరఖాస్తుల వివరాలను వెల్లడించారు.

ఆ రోజు కోసమే ఉత్కంఠ..

స్వీకరించిన దరఖాస్తులను ఈ నెల 27వన డ్రా తీయనున్నారు. దరఖాస్తు నంబర్లు, పేర్లతోపాటు వైన్‌షాపుల గెజిట్ నంబర్ల ఆధారంగా డ్రా ప్రక్రియ కొనసాగుతుంది. ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షలు వెచ్చించిన ఆశావహులంతా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. తమకు ఒక్క షాపు దక్కినా రూ.3లక్షలకు రూ. కోటి దాకా జాక్‌పాట్ వచ్చినట్లేనని భావిస్తున్నారు. ఇక కొంతమంది సిండికేట్‌గా ఏర్పడి 50 నుంచి 100 దరఖాస్తుల దాకా సమర్పించారు. ఇలాంటి గ్రూపులు సైతం తమకు నాలుగైదు షాపులు దక్కినా చాలని చెబుతున్నారు. కాలంతో సంబంధం లేకుండా నిత్యం లాభాలు కురిపించేలా ఈ వ్యాపారం ఉండడంతో చాలామంది ఆసక్తి చూపించారు. లాటరీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు దరఖాస్తుదారులు సిద్ధమయ్యారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

మద్దూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద పెయింటర్ ఏలూరి రామకృష్ణ ఇటీవల మృతి చెందాడు. గురువారం కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు ఇట్టబోయిన కనక చంద్రం రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, హైమద్ అలీ, బాలమల్లు, వెంకటేష్, మహేష్, భాస్కర్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేబోర్డు సభ్యుడిగా పుట్ట వంశీ



దుబ్బాక, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడిగా దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామానికి చెందిన పుట్టవంశీని నియమిస్తూ ఆ సంస్థ జనరల్ మేనేజర్ గురువారం ప్రకటించారు. మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు ప్రతిపాదనతో ఆయనను నియమించింది. ఈ సందర్భంగా పుట్టవంశీ మట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన ఎంపీ రఘునందన్‌రావుకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే సేవలను ప్రజలకు ఉపయోగపడేలా తనవంతుగా కృషి చేస్తానన్నారు.

వచ్చేనెల 2న ఖోఖో అసోసియేషన్ ఎన్నికలు

నర్సాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఎన్నికలు నవంబరు 2న నర్సాపూర్‌లోని లయన్స్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రతినిధి సాయిరాం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రతినిధులుగా బరిలో ఉండటానికి ఈ నెల 25వ తేదీవరకు నామినేషన్లు అందుబాటులో ఉంటాయని, 26వ తేదీ దరఖాస్తు చేసుకోవడానికి చివరిరోజు అని తెలిపారు. పూర్తి వివరాలకు 8008251614 నెంబరకు సంప్రదించాలని ఆయన సూచించారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు కో ఆర్డినేటర్

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సహాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి మాట్లాడుతూ దేశంలో అన్ని సమస్యలతో పాటు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అనేది ప్రధాన సమస్యగా మారిందన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తపై విద్యార్థులకు వివరించి, వాటిని వేరు చేసి ఇవ్వడం వల్ల జరిగే ప్రయోజనాలు తెలిపారు. కార్యక్రమంలో సహాస్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఇటికాల చిన్న, వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, నైనాదేవి, బాలరాజు, సంపత్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనుల గుర్తింపునకు ప్రణాళిక

మద్దూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ గ్రామాభివృద్ధి పనుల గుర్తింపునకు ప్రణాళిక చేపట్టినట్లు ఏపీవో మంజుల తెలిపారు. గురువారం మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్ అధ్యక్షతన ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనుల గుర్తింపునకు ప్రాధాన్యమివ్వనున్నట్లు ఏపీవో తెలిపారు. కార్యక్రమంలో టీఏ వెంకటమ్మ, ఎఫ్ఏ అయిలయ్య, ఏఎన్ఎం, అంగనవాడీలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ పనుల గుర్తింపు సమావేశంలో ఈజీఎస్ అధికారులు

సాఫీగా సాగేలా..

(5వ పేజీ తరువాయి)

కరీంనగర్, హుజూరాబాద్, హన్మకొండ, జనగామ మీదుగా ప్రయాణిస్తున్నారు. ఇదే హుస్నాబాద్ మీదుగా ఈ హైవే నిర్మాణం జరిగితే దాదాపు 30 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. కరీంనగర్ నుంచి కొత్తపల్లి వరకు ఇప్పటికే రాజీవ్ రహదారి ఉంది. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్‌కు ఫోర్‌లేన్ నిర్మాణం జరుగుతోంది. ఇక హుస్నాబాద్ నుంచి జనగామ వరకు 50 కిలోమీటర్ల మేర ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం జరిగితే ఈ ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట, రామాయంపేట వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కొత్తపల్లి నుంచి జనగామ వరకు హైవే నిర్మాణం జరిగితే, ఈ రెండు రహదారుల కారణంగా హుస్నాబాద్ రవాణా, వ్యాపారపరంగా మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నారు.

యాజమాన్యం వైఖరిపై ఫిర్యాదు

జిన్నారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బదిలీలు, సస్పెన్షన్లతో పరిశ్రమ కార్మికులపై యాజమాన్యం అవలంబిస్తున్న వైఖరిపై కార్మికశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య తెలిపారు. కాజీపల్లి పరిధిలోని శ్రీరామ పరిశ్రమలో యాజమాన్యం అణచివేత వైఖరి ప్రదర్శిస్తుందని ఆరోపించారు. పరిశ్రమ కార్మికులను మరో యూనిట్‌కు అన్యాయంగా బదిలీ చేస్తుందన్నారు. ఈ విషయమై గురువారం డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.